31వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
గురువారం 30 ఏప్రిల్ 2026 పేజీలు : 8

# సీఐ వెంకటేశ్వర్లకు డీఎస్పీగా పదోన్నతి



చురకలు ప్రతినిధి సిరిసిల్ల ఏప్రిల్ 29 : తమదైన శైలిలో సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందిన సీఐ వెంక టేశ్వర్లు పదోన్నతి పొందారు. డీఎస్పీ గా ప్రమోషన్ పొందుతూ ఉత్తర్వులు అందు కున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాన కొండూరు మండలానికి చెందిన ఆయన 1996 బ్యాచ్ కు చెందిన వెంకటేశ్వర్లు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్లో 2007 నుండి 2010 సంవత్సరంలో ఎస్సైగా పనిచేశారు వివిధ పోలీస్ స్టేషన్లో సమర్థ వంతంగా పనిచేసే సీఐగా ప్రమోషన్ పొందారు వివిధ స్టేషన్లో సిఐగా పనిచేస్తూ 2024 నుండి ఇప్పటివరకు చందుర్తి సిఐగా పని చేశారు శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిం చారు. కేవలం విధి నిర్వహణలోనే కాకుండా, సామాన్య ప్రజలకు అందు బాటులో ఉంటూ, వారి సమస్యల పరి ష్కారానికి కృషి చేయడంతో ఆయన ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన పదోన్నతి పట్ల ఆయా మండలాల ప్రజా ప్రతిని ధులు, పోలీస్ సిబ్బంది స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### పది ఫలితాల్లో జగిత్యాల జిల్లాకు

## రాష్ట్రస్థాయిలో నాలుగవ స్థానం



చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 : జగిత్యాల జిల్లాలో గత నెల మార్చి 13 నుంచి ఏప్రిల్ 15 వరకు నిర్వహించిన పదవ తరగతి పరీక్షలలో జగిత్యాల జిల్లా అద్భుత విజయంతో 98.87శాతంతో రాష్ట్రంలోనే 4వ స్థానం లో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా మొత్తంగా 12687 మంది విద్యా ర్థులకు గాను 12544 మంది విద్యార్థు లు అద్భుతంగా విజయాన్ని సాధించా రని, గతంలో నాలుగవ స్థానం మరియు ఇప్పుడు కూడా అదే స్థానాన్ని నిలుపుకో వడం ఇట్టి విజయానికి కృషిచేసిన జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, వివిధ మండలాల విద్యాధికారులను, పాఠశాల సిబ్బందిని, విద్యార్థులను, తల్లిదండ్రు లకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇదే స్ఫూ ర్తిని మునుముందు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి విద్యా ర్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణ మని తెలిపారు. ఇదే ఉత్సాహంతో భవి ష్యత్తులో విజయాలు సాధించి జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జిల్లా విద్యాధికారి కె.రాము, ఎంఈవోలు, జిల్లా కోఆర్డినేటర్లు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### స్వంత పార్టీ పెట్టడానికి

# కవితకు డబ్బులు ఎక్కడివి?

- కెసిఆర్ కుటుంబం అక్రమ ఆస్తి తగాదాలు పరిష్కరించుకొని మాట్లాడాలి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



చురకలు, విలేఖరి,వెల్గటూర్, ఏప్రిల్ 29 : రాష్ట్రంలో నూతన రాజకీయ పార్టీ స్థాపించడానికి కల్వకుంట కవితకు అన్ని డబ్బులు ఎక్కడి నుండి వచ్చాయని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ ప్రశ్నించారు.ధర్మపురినియోజకవర్గం ధర్మారంమండల కేంద్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో మార్కెఫెడ్ ఆధ్వర్యంలో మొక్క జొన్నధాన్యంకొనుగోలుకేంద్రాన్నిబుధవారంప్రారంభించినమంత్రి అడ్లూరి మాట్లాడుతూ,రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం అక్రమంగాసంపాదించినఆస్తుల సమస్యలు పరిష్కరించుకున్న తర్వాత ప్రజా ప్రభుత్వంపై విమర్శలుచేయాలనిపేర్కొన్నారు. నంది మేడారం, చామన్ పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు.బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి దిగిపో వాలి,బిఆర్ఎస్అధికారంలోకి రావాలని హరీష్ రావుతోపాటు కొత్తగా పార్టీలో చేరిన జీవన్ రెడ్డి మాట్లాడు తున్నారని, కల్వకుంట్ల కుటుంబం అక్రమ ఆస్తుల విషయం తేల్చిన తర్వాత ప్రజా ప్రభుత్వంపై మాట్లాడాలని విమర్శించారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు దిగిపోవాల ని అడ్లూరి పేర్కొన్నారు.కేసీఆర్ కూతురు కవితకుపార్టీపెట్టడాని కి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయోచెప్పాలని మంత్రి అడ్లూరి డిమాండ్ చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని మంత్రి తెలిపారు.మొక్కజొన్న రైతుల కు మద్దతు కల్పించాలని మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర చెల్లిస్తుందని మంత్రి తెలిపారు. మక్కజొన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్విని యోగం చేసుకొని రైతులు మద్దతు ధర పొందాలని మంత్రి పిలుపు నిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించి చేతులు

-2లో

# ధర్మపురి క్షేత్రంలో ఆధ్యాత్మిక సౌరభం

### లక్ష్మీనరసింహ స్వామికి లక్ష తులసీదళార్చన వైభవం





దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన ధర్మపురి క్షేత్రం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించి పోతోంది. పరమ పవిత్రమైన గోదావరి తీరాన వెలసిన ఈ పురాతన క్షేత్రంలో నరసింహ గర్భ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలలో భాగంగా బుధవారం నాడు శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారికి నిర్వహించిన 'లక్ష తులసీదళ అర్చన' భక్తజనావళిని పరవశానికి గురిచేసింది. సాధారణంగా విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైన తులసి దళాలతో స్వామిని అర్చించడం వల్ల సర్వ పాపాలు నశించి, మనశ్శాంతి లభిస్తుందని పురా ణోక్తి. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి (ఈఓ) శ్రీనివాస్ సంకటాల పర్యవేక్షణలో, క్షేత్ర ఆస్థాన వేద పండితులు మరియు అర్చక బృందం శాస్త్రోక్తంగా ఈ క్రతువును నిర్వహించారు.ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యాన్ని పరిశీలిస్తే, ఇది అరుదైన 'యోగ' మరియు 'ఉగ్ర' రూపాల్లో నరసింహ స్వామి కొలువై ఉన్న పుణ్యభూమి. ఈ నవరాత్రి ఉత్సవాల వేళ, వేద మంత్రోచ్ఛారణల మధ్య అష్టోత్తర శత (108) పుష్పార్చన కార్యక్రమం భక్తుల కనులవిందుగా సాగింది. ఆస్థాన పండితులు రమేశ శర్మ, ఉప ప్రధానార్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్య, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్య, నరసింహ మూర్తి, రమణాచార్య, వామన్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో తులసి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. తులసి అంటే 'సాటిలేనిది' అని అర్థం. ఈ దళాలతో అర్చించినప్పుడు లక్ష్మీ సమేతుడైన నరసింహుడు ప్రసన్నుడై భక్తుల కోరికలను ఈడేరుస్తాడని ప్రతీతి. అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మారుమోగించారు.?ఈ ఉత్సవాలకు పరాకాష్ఠగా ఏప్రిల్ 30వ తేదీన నరసింహ జయంతిని పురస్కరించుకుని ఆలయ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. హిరణ్య కశిపుని సంహరించి

-2లో

### సరస్వతి అంత్య పుష్కరాలను

## విజయవంతంగా నిర్వహించాలి



- సరస్వతి అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలి

చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29 : సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు సంబంధించి బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన, రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సమక్షంలో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్ట ర్ రాహుల్ శర్మ వివరించారు. పుష్కరా ల నిర్వహణలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలు, రవాణా, పారిశుద్ధ్యం తదితర

-2లో

## పదవ తరగతి ఫలితాల్లో బాలికలదే హవా

### -మండలంలో 99.6 శాతం ఉత్తీర్ణత



**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 29:** ధర్మపురి మండలంలో బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో బాలికలు అత్యుత్తమ ఫలితాలు సాధించి మండలంలో అగ్రగామిగా నిలిచారు. ధర్మపురి మండలంలో 647 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 645 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మండలంలో 99.6 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన ఉమయ్య తరుణం విద్యార్థిని 583 మార్కులు సాధించి మండలంలో టాపర్ గా నిలిచింది అదేవిధంగా మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాలకు చెందిన గరిగే చైత్ర 570 మార్కులు సాధించారు. కస్తూర్బా గాంధీ పాఠశాల కు చెందిన విద్యార్థిని హానిషా,మరియు లక్ష్మి అనిత 558 మార్కులు సాధించగా,సిరివెన్నెల 550 మార్కులు వచ్చాయి. పట్టణంలోని జెడ్ పి హెచ్ ఎస్ బాలికల పాఠశాలకు చెందిన శ్రీహర్ష 558 జెడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాల చెందిన విద్యార్థి మనిచంద్ 524 మార్కులు సాధించారు. ప్రైవేటు పాఠశాలల్లో పట్టణంలోని ఆంగ్ల వేదిక్ విద్యార్థిని శ్రేయ 580 మార్కులు సాధించి మండలంలో రెండవ స్థానంలో నిలిచారు.కేరళ ఇంగ్లీషు మీడియం పాఠశాల కు చెందిన ముత్తునూరి కారుణ్య 564 వచ్చాయి.ఉత్తమమైన ప్రతిభ చాటిన విద్యార్థుల ను మండల విద్యాధికారిని సీతాలక్ష్మి,ఆయా పాఠశాల ల ప్రిన్సిపాల్ లు అభినందించారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఏప్రిల్ 29:** వేసవి కాల దృశ్య మండుతున్న ఎండలలో ఉపాధి హామీ కూలీలు తగ్గ జాగ్రత్త చర్యలు పాటించాలని ఎంపీడీఓ సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను గ్రామ అధికారులతో కలిసి పరిశీలించారు.అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్స్ పంపిణి చేసి పనులు చేస్తూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. ఇందులో సర్పంచ్ కనుగందుల లక్ష్మి సంజీవ్, ఉపసర్పంచ్ ఆకుల రాకేష్ తదితరులు ఉన్నారు.

## మెట్లచిట్టాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఏప్రిల్ 29:** మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామాల్లో బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పిఏసిఎస్) ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సుంకేట అరుణ గంగాధర్ ప్రారంభించారు.ఈ మేరకు సర్పంచ్ అరుణ రైతులతో మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఇందులో ఉపసర్పంచ్ బంటు నారాయణ,సీఈవో బంటు తిరుపతి,అర్జున్,విడిసి సభ్యులు రైతులు ఉన్నారు.

### స్వంత పార్టీ పెట్టడానికి

# కవితకు డబ్బులు ఎక్కడివి?

**మొదటి పేజీ తరువాయి....** దులుపుకుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. గత ఖరీఫ్ సీజన్ లో రైతుల వద్ద సేకరించిన ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సీఐ ద్వారా వెంటనే సేకరించి యాసంగి ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. రబీ సీజన్ లో రైతులు పండించిన ధాన్యం చివరి దాన్యం గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. చామనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇరిగేషన్ శాఖ ద్వారా సంప్రదింపులు జరిపి కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించే విధంగాచర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. నూతనం గా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద బోరుబావి ఏర్పాటు తోపాటు విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీఇచ్చారు. గ్రామంలో అంబేద్కర్ భవనం ఏర్పాటు తోపాటు ఆలయాల అభివృద్ధికికృషిచేస్తామన్నారు.ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిదులు, అధికారులు, రైతులు,నాయకులుపాల్గొన్నారు.

# ధర్మపురి క్షేత్రంలో ఆధ్యాత్మిక సౌరభం

**మొదటి పేజీ తరువాయి...** భక్త ప్రహ్లాదుని రక్షించేందుకు మహావిష్ణువు ధరించిన ఈ నాలుగవ అవతారం అత్యంత విశిష్టమైనది. “ఉగ్రం వీరం మహా విష్ణుం జ్వలంతం సర్వతో ముఖం; నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం” అనే శక్తివంతమైన మంత్రాన్ని పఠిస్తూ భక్తులు స్వామిని శరణు వేడుకుంటున్నారు. సూర్యాస్తమయ సమయంలో, స్తంభం నుండి ఉద్భవించిన స్వామి తత్వాన్ని స్మరిస్తూ, ధర్మపురిలో ప్రత్యేక జన్మదిన వేడుకలు జరగనున్నాయి. వైశాఖ శుక్లపక్ష చతుర్దశి నాడు, స్వాతి నక్షత్రయుక్త ప్రదోష కాలంలో సంభవించిన ఈ అవతార విశిష్టతను పురస్కరించుకుని, ఉదయం నుండే క్షేత్రంలో అభిషేకాలు, పంచోపనిషత్ యుక్త పూజలు, మరియు సంభోద్భవకాల విశేష పూజలు నిర్వహిస్తారు.ఆధ్యాత్మికంగానే కాకుండా, సామాజిక సేవా దృక్పథంతో కూడా ఆలయ కమిటీ విశేష కృషి చేస్తోంది. భక్తుల సౌకర్యార్థం 516 రూపాయల చెల్లింపుతో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, గోత్రనామాలపై పూజలు జరిపిన అనంతరం ప్రసాదాన్ని పోస్టు ద్వారా పంపే సౌకర్యాన్ని కల్పించారు. అలాగే, ఆలయ నిత్యాన్నదాన పథకానికి విరాళాలు ఇచ్చే దాతలకు ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 80(జి) కింద మినహాయింపు లభిస్తుందని ఈఓ వివరించారు. గోదావరి స్నానాలు, తులసీదళ పూజలు, వేద పండితుల ఆశీర్వచనాలతో ధర్మపురి క్షేత్రం వైకుంఠాన్ని తలపిస్తోంది. ఈ పుణ్య ఘడియల్లో స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని భక్తులు భావిస్తున్నారు. ఈ మహోత్సవాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించడమే కాకుండా, మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు దిక్సూచిగా నిలుస్తున్నాయి.

# గ్రామ గ్రామాన పండగలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

**చురకలు విలేకరి, రాయికల్, ఏప్రిల్ 29:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి గ్రామ గ్రామాన పండగల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం రాయికల్ పట్టణం తోపాటు మండలంలోని అయోధ్య గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అయ్యాయి.అదనంగా మరొక 2వేల ఇండ్ల మంజూరుకు కృషి చేస్తున్నా అన్నారు.నియోజకవర్గ పరిధిలో ప్రతి గ్రామాన 20 ఇండ్లకు తక్కువ కాకుండా



నిర్మాణాలు జరుగుతున్నాయని అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు.రాజకీయాలు ఎన్నికల వరకే అని అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు.50 ఏండ్ల క్రితం మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల తర్వాత నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యం లో పేద మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కల సాకారం అయింది అని పేర్కొన్నారు.జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి,మున్సిపల్ చైర్మన్ కట్కం రవి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్రావు,సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్, ఏనుగు మల్లారెడ్డి, గన్నె రాజిరెడ్డి ,మాజీ సర్పంచ్ జీవన్ రెడ్డి, కౌన్సిలర్లు రాకేష్, పల్లికొండ గంగాధర్,ఉపసర్పంచ్ తాలూకా రాజేశం, మాజీ ఎంపిటిసి రవి,నాయకులు సురేష్ ,వినోద్ రావు, నర్సయ్య, తిరుపతిరావు,మాజీ సర్పంచ్ ముత్తయ్య,స్తానిక వార్డు సభ్యులు తిరుపతి, జలంధర్ రెడ్డి,జగన్ ,పవన్ ,బాలయ్య,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### సరస్వతి అంత్య పుష్కరాలను

## విజయవంతంగా నిర్వహించాలి

**మొదటి పేజీ తరువాయి...**అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, సరస్వతి అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు జరుగనున్న పుష్కరాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున చేపట్టిన ఏర్పాట్లును త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం సరస్వతి అంత్య పుష్కరాల పోస్టర్, పుష్కరాల టీజర్ను విడుదల చేశారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి శూన్యం

**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 29:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి శూన్యమని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి పట్టణంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆయన అన్నారు. ధర్మపురి పట్టణంతోపాటు మండలంలో గతంలో వడ్ల కొనుగోలులో అవినీతి జరిగిందని ఆరోపించిన కాంగ్రెస్ నాయకులు నేడు అదే రకంగా అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ మరియు ఇందిరమ్మ నిర్మాణం పనుల్లో కార్యకర్తలు అవినీతి చేశారని అన్నారు. ధర్మపురి పట్టణంలో నేటికీ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన అభివృద్ధి పనుల కనిపిస్తున్నాయని మీరు చేసిన పనులు శూన్యం అన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి మాతా శిశు ఆసుపత్రి నిర్మాణం చేపడితే 2 సంవత్సరాల నుండి వసతులు కల్పించి ప్రారంభించలేకపోయారని అన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో కోరుట్ల మండలంలో ఉత్తీర్ణత 97%




**చురకలు ప్రతినిధి కోరుట్ల ఏప్రిల్ 29:** బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కోరుట్ల మండలం మెరుగైన ఫలితాలు సాధించింది మండలంలోని 18 పాఠశాలల నుంచి మొత్తం 770 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 746 మంది ఉత్తీర్ణత సాధించి 97% పాస్ శాతం నమోదు చేశారు మండలంలోని 12 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం వాటిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు యూసుఫ్‌నగర్,ఐలాపూర్, పైడిమడుగు, జోగన్‌పల్లి, చిన్న మెట్పల్లి, నాగులపేట, వెంకటాపూర్, మోహన్‌రావుపేట, కేజీబీవీ కల్లూరు, తెలంగాణ మోడల్ స్కూల్ కల్లూరు, మైనార్టీ స్కూల్ , సోషల్ వెల్ఫేర్ బాయ్స్ పాఠశాలలు ఉన్నాయి వ్యక్తిగత ప్రతిభలో తెలంగాణ మోడల్ స్కూల్ కల్లూరుకు చెందిన కుమారి అల్లే జాహ్నవి 580 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోహన్‌రావుపేటకు చెందిన ముమ్మాడి సాయి చరణ్ 578 మార్కులతో ద్వితీయ స్థానం పొందారు ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి శ్రీ కే. రాము ఉత్తీర్ణులైన విద్యార్థులను 100% ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను అభినందించారు మండల విద్యాధికారి కూడా విద్యార్థుల కృషిని ప్రశంసించారు.

## చిన్నారిని ఆశీర్వదించిన డాక్టర్ రఘు



**చురకలు ప్రతినిధి కోరుట్ల ఏప్రిల్, 29 :-** కోరుట్ల పట్టణంలోని 25వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కలాల సాయిచందు దంపతుల కుమార్తె కేశ ఖండన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెట్లపల్లి దేవేందర్ గౌడ్, సోమిడి ప్రశాంత్, కోరుట్ల రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో స్లేట్ హైస్కూల్ ప్రభంజనం

### -వంద శాతం రిజల్ట్ తో దుమ్ము రేపిన స్లేట్ హైస్కూల్
### -571 మార్కులతో ఎర్రోజుల రిషిత స్కూల్ టాపర్
### -19 మంది విద్యార్థులకు 500 పైగా మార్కులు





**జగిత్యాల, ఏప్రిల్ 29 :** జగిత్యాలలోని స్లేట్ హైస్కూల్ పదవ తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణతతో సంచలనం సృష్టించింది. పరీక్షలు రాసిన 33 మంది విద్యార్థులకు 33 మంది ఉత్తీర్ణులు కాగా "పదిలో" స్లేట్ హైస్కూల్ దుమ్ము రేపింది.వీరిలో 19 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించి పాఠశాల ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. ఎర్రోజుల రిషిత 571/600 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచి కొత్త రికార్డు నెలకొల్పింది. ఎస్. వరుణ్, తిక్క వర్షిత 570 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.వరుసగా మూడో ఏడాది కూడా 100 శాతం ఫలితాలు సాధించడంతో పాటు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో జిల్లాలోనే స్లేట్ హైస్కూల్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. విద్యార్థుల విజయం పట్ల పాఠశాల కరస్పాండెంట్ ఎడమల జగన్మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ స్వప్న, డైరెక్టర్లు

# మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే)ను ఘనంగా జరపాలి



**చురకలు ప్రతినిధి కోరుట్ల ఏప్రిల్ 29:** మే 1న జరగనున్న (మే డే) ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాము లు పిలుపునిచ్చారు బుధవారం కోరుట్ల మున్సిపల్ కార్యాలయం ముందు మేడే ఉత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కార్మికుల హక్కుల కోసం అమరవీ రులు చేసిన త్యాగాల ఫలితంగా మే డే పుట్టిందని పేర్కొన్నారు. 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలోని హేమార్కెట్ ప్రాంతంలో 8 గంటల పని దినం కోసం పోరాడిన కార్మికులపై జరిగి న కాల్పులు కార్మిక ఉద్యమ చరిత్రలో మైలురాయిగా నిలిచాయని తెలిపారు ఆ సంఘటనల నుంచే ఎర్రజెండా కార్మికుల ఐక్యతకు ప్రతీకగా మారిందన్నారు ఆ పోరాటాల ఫలితంగా 8 గంటల పని విధానం కనీస వేతనాలు బోనస్ చెల్లింపు చట్టం ఫ్యాక్టరీల చట్టం నష్టపరిహార చట్టం ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ వంటి అనేక హక్కులు సాధించు కున్నామని వివరించారు ప్రస్తుతం కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో పాత కార్మిక చట్టాలను నిలిపివేసి కొత్త లేబర్ కోడ్లు తీసుకువచ్చిందని విమర్శించారు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాలను అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు ఇటీవలి కాలంలో ఉద్యోగులకు జీతభత్యాలు పెరగకపోవడం పీఆర్‌సీ అమలు కాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కనీస వేతనం రూ.26,000గా అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.10,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు మే 1న ఉదయం ఎర్రజెండాలు ఎగురవేసి అమరవీరులకు నివాళులు అర్పిస్తూ అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు బీడీ భవన నిర్మాణ మున్సిపల్ అంగన్వాడీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు గంగారం రాజం సాయిలు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

### పిఎంఎస్ హెచ్‌ఆర్ఐ తెలంగాణ మోడల్ స్కూల్,

## కల్లూరు (కోరుట్ల) పదవ తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణతతో రికార్డు






**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్ 29 :** బుధవారం విడుదలైన పదవ తరగతి (రెగ్యులర్) మార్చి-2026 ఫలితాల్లో జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని పి ఎం ఎస్ హెచ్ ఆర్ ఐ తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీ, కల్లూరు విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 100% ఉత్తీర్ణత సాధించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ భీమనాతి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.మొత్తం పరీక్షలకు హాజరైన విద్యార్థులు 100,ఉత్తీర్ణత శాతం 100%,బాలురు 52 మంది,బాలికలు 48 మంది,500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 45 మంది550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 17 మందిపాఠశాల టాపర్లుమొదటి స్థానం అల్లే జాహ్నవి 580 మార్కులు,రెండవ స్థానం నర్సింగోజు కిరణ్మయి 575 మార్కులు,మూడవ స్థానం సిరికొండ చందన 574 మార్కులు, నాలుగవ స్థానం బండి సౌమ్య -- 573 మార్కులుఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భీమనాతి మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల కఠోర శ్రమ ఉపాధ్యాయుల అంకిత భావం తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విశిష్ట విజయం సాధ్యమైందని తెలి పారు. అన్ని విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్తు మరిన్ని విజయాలతో నిండాలని ఆకాంక్షించారు.

### ఇచ్చిన హామీ

## నిలబెట్టుకున్న కౌన్సిలర్



**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 29:** ఇటీవల మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రచారం లో ఇచ్చిన హామీని ధర్మపురి పట్టణానికి చెందిన 13 వార్డ్ కౌన్సిలర్ చిపిరిశెట్టి రాజేష్, మరోసారి నిలుపుకున్నారు. వార్డు పరిధిలోని ఏ ఆడబిడ్డ వివాహం జరిగిన 5016 రూపాయలు ఆడబిడ్డ కానుక గా ఇస్తానని హామి ఇచ్చారు. బుధవారం 13 వ వార్డ్ కు చెందిన పాంచాలి వేదాక్షి - సాయి గణేష్ ల వివాహం జరిగింది. వివాహానికి హాజరై అమ్మాయి తల్లిదండ్రులకి మేనమామ కట్నంగా 5016 అందించారు. ప్రతి ఆడబిడ్డ కు 5 సంవత్సరాల పాటు తోడుగా ఉంటానని చిపిరిశెట్టి రాజేష్ తెలిపారు. చల్ల జనార్ధన్ గడిపెల్లి సత్యనారాయణ, మాదాసు కృష్ణ, బొంగరాల శ్రీనివాస్,బండి రాజశేఖర్, నరెడ్ల రవి,శీలం రవి, తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లమ్మ బోనాల వేడుకల్లో

## పాల్గొన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడలో రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పండుగలో మాజీ మంత్రి బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కుర్మ సోదరులు 5 సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి బోనాలు కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జీవాలకు, పంట పొలాలకు, మనపైన ఎల్లమ్మ తల్లి కృప ఉండాలి అన్నారు. మన ప్రాంతంతో పాటు యావత్తు సమాజాన్ని తల్లి చల్లగా చూడాలని జీవన్ రెడ్డి ఆకాంక్షించారు.

## ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత

**చురకలు విలేకరి, మల్లాపూర్, ఏప్రిల్ 29:** ప్రభుత్వం విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో మండల విద్యాధికారి కేతిరి దాయోదర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రణాళిక బద్దంగా చదివిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. మండల టాపర్గా మొగిలిపేటకు చెందిన అనుష్క 574 మార్కులు సాధించి ప్రథమ స్థానం నిలువగా, అనువంశిక 573 మార్కులు సాధించిన ద్వితీయ స్థానం, రిఖిఖ 572 మార్కులతోతృతీయ స్థానంలో నిలిచారు.

## వెల్లుల్ల ప్రభుత్వ పాఠశాల ఘనత పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత...





**చురకలు విలేకరి, మెట్‌పల్లి, ఏప్రిల్ 29 :** మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటింది. ఈరోజు విడుదలైన ఫలితాల్లో ఈ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందింది. ఉపాధ్యాయుల కృషి.. విద్యార్థుల పట్టుదల వల్లే ?ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు హాజరైన 47 మంది విద్యార్థులకు గాను, అందరూ (47 మంది) విజయవంతంగా ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందుతుందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని, ?ఈ ఘన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించడం, విద్యార్థులు క్రమశిక్షణతో చదవడమే ఈ విజయానికి కారణమని వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని తీర్చిదిద్దడం వల్లే ఈ నూరు శాతం ఫలితం సాధ్యమైందని అయన హార్షం వ్యక్తం చేశారు.

?సంబరాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు..

?తమ పిల్లలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందానికి, హెచ్.ఎం శ్రీనివాస్ రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల స్థాయిలో వెల్లుల్ల ప్రభుత్వ పాఠశాలలో చదివినమాలేపు రిషిక 563/600 - మ్యాకల మేఘన 544/600 వచ్చిన సందర్భంగా గ్రామస్తులు విద్యా కమిటీ సభ్యులు పాఠశాల సిబ్బందిని అభినందించారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



**చురకలు విలేకరి, ఏప్రిల్ 29 (చురకలు):** రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వరి ధాన్యం విక్రయించాలని ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ తెలిపారు. బుధవారం మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్నీ ఆమె ప్రారంభించారు. రైతులకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని రైతులు వీటిని సద్దినపర్చుకోవాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండవేణి సత్తవ్వ గంగమల్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, పిల్లల భద్రతపై విస్తృత అవగాహన



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, మహిళలు, పిల్లల భద్రతతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో భరోసా సెంటర్ సిబ్బంది విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రం లోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాల యాలలో పనిచేస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని, పని ప్రదేశాలలో ఎదురయ్యే లైంగిక వేధింపులపై చట్టపరమైన రక్షణలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే తక్షణ చర్యలపై సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా, లైంగిక వేధింపులకు గురైన సందర్భంలో మహిళలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, ఇందుకు అందుబాటులో ఉన్న హెల్ప్ లైన్ నంబర్లు, భరోసా సెంటర్ సేవలు, పోలీస్ శాఖ అందిస్తున్న సహాయ వ్యవస్థల గురించి స్పష్టంగా తెలిపారు. చిన్నారులపై జరుగుతున్న నేరాల నివారణలో భాగంగా పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. పిల్లలపై ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు బాధ్యులు స్పందించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్ సిబ్బంది, మహిళలు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు రావాలని, ఎలాంటి సమస్య వచ్చినా భరోసా సెంటర్, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

# డ్రగ్స్ నిర్మూలన, మహిళల, పిల్లల భద్రత అందరి బాధ్యత




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** డ్రగ్స్ నిర్మూలన, మహిళల, పిల్లల భద్రత అందరి బాధ్యత అని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళి కలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూల న, మహిళల, బాలల భద్రత పై అవగా హన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ మరియు ఈగిల్ టీమ్ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల భద్రత, రక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన మరియు వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా చైల్డ్ సేఫ్టీ అండ్ సే నో టు డ్రగ్స్ కార్యక్రమాన్ని వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించను న్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సూచించిన 5వ అంశమైన పిల్లల భద్రత మరియు మాదకద్రవ్యాల నిర్మూలనపై జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వ" హించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో పోలీసు సిబ్బంది ప్రత్యక్షంగా వెళ్లి డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత జీవితమే కాకుండా కుటుంబం మరియు సమాజంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని, యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకునే ప్రమాదం ఉందన్నారు. గంజాయి సరఫరా మరియు వినియోగంపై ఇప్పటికే పోలీస్ శాఖ కఠిన నిఘా ఉంచిందని, గతంలో గంజాయి కేసుల్లో ఉన్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. డ్రగ్స్ వినియోగించే వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా వారిని సరికొత్త మార్గంలో నడిపించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు, మహిళలు మరియు పిల్లల భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండదని, వారి రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

# పది ఫలితాల్లో జగిత్యాల జిల్లాకు రాష్ట్రస్థాయిలో నాలుగవ స్థానం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** జగిత్యాల జిల్లాలో గత నెల మార్చి 13 నుంచి ఏప్రిల్ 15 వరకు నిర్వహించిన పదవ తరగతి పరీక్షలలో జగిత్యాల జిల్లా అద్భుత విజయంతో 98. 87శాతంతో రాష్ట్రంలోనే 4వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా మొత్తంగా 12687 మంది విద్యార్థులకు గాను 12544 మంది విద్యార్థులు అద్భు తంగా విజయాన్ని సాధించారని, గతం లో నాలుగవ స్థానం మరియు ఇప్పుడు కూడా అదే స్థానాన్ని నిలుపుకోవడం ఇట్టి విజయానికి కృషిచేసిన జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, వివిధ మండలాల విద్యాధికారులను, పాఠశాల సిబ్బందిని, విద్యార్థులను, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇదే స్ఫూర్తిని ముమందు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని తెలిపారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో వి జయాలు సాధించి జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జిల్లా విద్యాధికారి కె.రాము, ఎంఈవోలు, జిల్లా కోఆర్డినేటర్లు, విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి శూన్యం

**చురకలు విలేకరి, ధర్మపురి, ఏప్రిల్ 29:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి శూన్యమని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి పట్టణంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆయన అన్నారు. ధర్మపురి పట్టణంతోపాటు మండలంలో గతంలో వడ్ల కొనుగోలులో అవినీతి జరిగిందని ఆరోపించిన కాంగ్రెస్ నాయకులు నేడు అదే రకంగా అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

# సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలి

**-అనధికారిక వ్యక్తులకు ఫోన్ ద్వారా ఓటీపీలు ఇతర సమాచారం ఇవ్వవద్దు**
**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,హాజరైన ఎస్పీ మహేష్ బి గితే**



**చురకలు ప్రతినిధి,సిరిసిల్ల ఏప్రిల్ 29 :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా బాలల భద్రత..డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా సైబర్‌క్రైమ్‌పై ఇల్లంత కుంటమండలం పెద్దలింగాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం సైబర్ క్రైమ్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా బాలల భద్రత,డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా సైబర్ క్రైమ్‌పై ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని మహిళా,శిశు ,దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ,పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.ఈ సందర్భంగా షి టీమ్ నంబర్ 87126 56425, మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, టెలీ మానస్ 14416 హెల్ప్ లైన్ పై వివరించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10శాఖల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు,చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు, డ్రైవర్లకు వైద్య పరీక్షలు,కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు.

**ఫోన్ నెంబర్ సేవ్ చేసుకోవాలి**

గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంక్, ఇతర సంస్థల నుంచి ఫోన్ చేస్తున్నామని,ఓటీపీ,ఇతర వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు.గుర్తు తెలియని వ్యక్తులు ఏపీకే ఫైల్స్ ఫోన్ కు పంపి హ్యాకింగ్ చేస్తారని తెలిపారు. మొబైల్ ఫోన్ వినియోగించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930, బాలల హెల్ప్ లైన్ 1098, 112, ఇతర సహాయం అందించే అన్ని హెల్ప్ లైన్ నంబర్లు ప్రతి ఒక్కరూ తమ ఫోన్ లో సేవ్ చేసుకోవాలని సూచించారు. బాలికలు, కిశోర బాలికలు, యువతులు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే సంబంధిత హెల్ప్ లైన్‌లో సంప్రదించాలని తెలిపారు.విద్యార్థులు ఆటలు ఆడాలని, కచ్చితంగా చదవాలని తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని పేర్కొన్నారు.సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు.ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం చేయాలని, ఏదైనా కొలువు సాధించాలని ఆకాంక్షించారు.డ్రాప్ ఔట్ కావద్దని స్పష్టం చేశారు.మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. కోడిగుడ్లు, బాలామృతం,ఇక్రిశాట్ వారి సూచనల మేరకు రూపొందించిన స్నాక్స్,పాలు పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.చదివే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పిల్లలు తినడం, ఆడుకోవడం ఇతర అంశాల్లో రాణిస్తారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువుకొలుస్తారని,దానికి సంబంధించిన కార్డులో నమోదు చేస్తారని, ఎదుగుదల లోపించిన పిల్లలకు ప్రత్యేక వైద్యం, పోషకాహారం అందిస్తారని తెలిపారు. శారీరక, మానసిక ఇతర ఎదుగుదల లోపించిన పిల్లలను ఆర్ బీ ఎస్ కే వాహనాల ద్వారా వేములవాడలోని డీఈఐసీ హాస్పిటల్ తీసుకువెళ్తారని వివరించారు.

**సైబర్ క్రైమ్‌కు గురైతే పోలీసులను సంప్రదించాలి**

జిల్లాలో ఎవరైనా సైబర్ క్రైమ్ కు గురైతే వెంటనే 1930 లేదా సమీప పోలీసులను సంప్రదించాలని ఎస్పీ మహేష్ బి గితే సూచించారు.క్రెడిట్, డెబిట్ కార్డు యాక్టివేషన్,బ్యాంక్,పోస్ట్ ఆఫీస్ నుంచి చేస్తున్నామని ఫోన్లో అడిగే వారికి స్పందించవద్దని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు డిజిటల్ అరెస్ట్ కాలేదని స్పష్టం చేశారు.అలాగే జనగణన కోసం ఇంటింటికి ప్రభుత్వ ఉద్యోగులు వస్తారని, వారి గుర్తింపు కార్డు, వివరాలు తెలుసుకున్న తరువాత అందరూ తమ వివరాలు వెల్లడించాలని తెలిపారు.మహిళలు,యువతల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ఫోటోలు షేర్ చేయవద్దని సూచించారు.సోషల్ మీడియా అకౌంట్ ప్రైవేట్ అని పెట్టాలని, పబ్లిక్ అని పెట్టవద్దని తెలిపారు.జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా అరైవ్.. అలైవ్ కింద వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించామని తెలిపారు. ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వెళ్లడంతో నాంపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో బుధవారం ఉదయం ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ లేకుండా వెళ్లడంతో మృతి చెందాడని తెలిపారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు,రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.గ్రామంలో ఏర్పాటు అయిన రోడ్ సేఫ్టీ కమిటీ బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని,వేసవిలోఎండలో తిరగవద్దని సూచించారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు,డీఎస్పీ నాగేంద్రాచారి,జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీ రాజం,మండల ప్రత్యేకాధికారి రామ కృష్ణ,తహసీల్దార్ సురేష్,ఎంపీడీఓ శశి కళ,సర్పంచ్ వసంత పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ




**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఏప్రిల్, 29 :** ఈరోజు భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జిదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసా లోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు. గతంలో గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్ లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## శ్రీరామాంజనేయ ప్రతిష్టాపన మహోత్సవం



**చురకలు విలేఖరి వీణవంక ఏప్రిల్ 29 :**

వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలోబుధవారం శ్రీ రామాంజనేయ స్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా దేవదా మూర్తులను అలాగే ధ్వజస్తంభం ప్రతిష్టాపన జరిగింది.అలాగే సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది.ఈ మహోత్సవాలకు మల్లారెడ్డిపల్లి గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివస్తారు. దేవదామూర్తులు మహిళల గ్రామస్తులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..?శాంతి కల్యాణం,లోక కల్యాణం కోసం ఈ మహోత్సవ నిర్వహించడం జరుగుతుంది. గ్రామం లోని ప్రజలు పాడిపంటలతో సుఖసంతోషాలతో దేవుని ఆశీస్సులు ఉండాలని ఈ మహోత్సవం జరపడం జరుగుతుందని తెలిపారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

## శ్రీ మార్కండేయ దేవాలయ 68వ, వార్షికోత్సవ వేడుకలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 29 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ దేవాలయ 68వ,వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండుగ గా బుధవారం జరిగాయి.శ్రీ పరాభవ నామ సంవత్సర వైశాఖ శుద్ధ త్రయోదశి తేదీ:29-04-2026(బుధవారం) రోజున, అర్చకులు వైరాగ్యం విజయ్ కుమార్ ఆధ్వర్యంలోశ్రీ మార్కండేయ దేవాలయం 68వ,వార్షికోత్సవం సందర్భంగా మార్కండేయ దేవాలయంలో పూజా కార్యక్రమం,ఉదయం 9 గంటల నుండి జరుపబడును,గణపతి పూజ,గౌరీ పూజ,స్వస్తి పుణ్యాహవాచనం, నవగ్రహారాధన,మహా రుద్రాభిషేకం, పూర్ణాహుతి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తకోటికి అన్నప్రసాద వితరణ చేశారు,ఈ యజ్ఞంలో గోషిక దాసు వనం రమేష్ దంపతులు పాల్గొన్నారు, కార్యక్రమాలను ఎల్లారెడ్డిపేట పద్మశాలి సేవాసంఘం అధ్యక్షులు వనం రమేష్ ప్రధాన కార్యదర్శి రాపల్లి అంబదాస్ ఉపాధ్యక్షులు గాజుల దేవదాస్ మాదాస్ నాగరాజు సుంకి భాస్కర్ సంయుక్త కార్యదర్శి శ్రీరామ్ సుదర్శన్ యూత్ సంఘం అధ్యక్షులు దోమల భాస్కర్ ప్రధాన కార్యదర్శి సుంకి విష్ణుమూర్తి ఉపాధ్యక్షులు చింతకింది శ్రీకాంత్ దొంత మనోహర్ , ఇప్పలపల్లి కిరణ్ సంయుక్త కార్యదర్శి గజ్జెల్లి నరసింహులు దుంపేటి శ్రీధర్ లు నిర్వహించారు, ఈ వార్షికోత్సవ వేడుకల్లో ఎల్లారెడ్డిపేట గ్రామ సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఉప సర్పంచ్ బంధారపు బాల్రెడ్డి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య గ్రామ శాఖ అధ్యక్షులు ఎడ్ల సందీప్ శ్రీ లక్ష్మీ కేశవ పెరుమల్ల ఆలయ కమిటీ అధ్యక్షులు పారిపల్లి రామిరెడ్డి వార్డు సభ్యులు ఆంజనేయులు నాయకులు పారిపల్లి సంజీవారెడ్డి గుండాడి వెంకటరెడ్డి పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు డాక్టర్ వనం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలి

**-ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**చురకలు ప్రతినిధి,జయశంకర్ భూపాలపల్లి,ఏప్రిల్ 29 :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులకు సూచించారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామంలో , గణపురం మండలంలోని కర్కపల్లి, గాంధీనగర్, మైలారం గ్రామాలలో పిఎసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర 2389/- రూపాయలతో పాటుగా బోనస్ 500 రూపాయలు ఇస్తుందని తెలిపారు, వ్యవసాయ శాఖ అధికారులు కోత మిషన్ల యొక్క ఆర్పిఎం 18 నుండి 20 వరకు, బ్లోయర్ ఆన్ లో ఉంచే విధంగా కోత మిషన్ యజమానులకు తెలియజేయాలని ఇలా చేయడం వల్ల ధాన్యంలో తాలు ఉండదని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తి జోక్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని రైతులకు సమయానికి డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు .అలాగే కొనుగోలు కేంద్రాల్లో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు.రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా డి.ఎస్.ఓ,డి ఎం,సివిల్ సప్లై అధికారులు,వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్మారక బ్యారక్‌ను ప్రారంభించిన పోలీసు కమిషనర్

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 29 :** హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన అమర వీరుల స్మారక బ్యారక్‌ను కరీంనగర్ పోలీసుకమిషనర్ గౌస్ఆలం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ క్రమంలో ఎంతోమంది పోలీసులు అమరుల య్యారని గుర్తు చేశారు. అమరవీరుల స్మారకంగా స్థానిక పోలీసులు బ్యారక్ నిర్మించడం అభినందనీయమని ప్రశంసించారు.



ప్రతిఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కృషి చేయాలని కోరారు. పోలీసులు, ప్రభుత్వ కృషి వల్ల నేడు నక్సలిజం పూర్తిగా తగ్గిందన్నారు. నేరాలను పూర్తిగా అదుపు చేసేందుకు ప్రజల సహకారం అవసరం అని గుర్తు చేశారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నియంత్రణ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు తగ్గేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక శాంతిభద్రతలను పోలీసు కమిషనర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏసిపివాసంశెట్టి మాధవి ,సిఐటి కరుణాకర్,పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు,ఏఎస్ఐలు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా

**-97%పైగా ఉత్తీర్ణత**
**-హుజురాబాద్ ఎంఈఓ విడపు శ్రీనివాస్ వెల్లడి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 29 :** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 97% పైగా ఫలితాలను సాధించి ప్రతిభను చాటారని మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ వెల్లడించారు. సోమవారం 10వ తరగతి ఫలితాలు విడుదలైన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుండి 156 మంది బాలురు 135 బాలికలు మొత్తం 291 హాజరు కాగా.. బాలురు 151 బాలికలు 132 మొత్తం 283 మంది ఉత్తీర్ణులయ్యారని, బాలురు 96.79%, బాలికలు 97.78% మొత్తం కలిపి 97.25% ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మండలంలోని 4 రెసిడెన్షియల్ పాఠశాలలో 163 మంది బాలురు 72 బాలికలు కలిపి మొత్తం 235 మంది 100% ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 319 మంది బాలురు 207 బాలికలు మొత్తం 526 హాజరు కాగా 314 వీరిలో బాలురు, 204 బాలికలు మొత్తం కలిపి 518 మంది ఉత్తీర్ణులయ్యారని, బాలుర ఉత్తీర్ణత శాతం 98.43% బాలికల ఉత్తీర్ణత శాతం 98.55% మొత్తము ఉత్తీర్ణత శాతం 98.48% గా నమోదు అయినట్లు తెలిపారు. మండలంలోని 11 ప్రైవేట్ పాఠశాలల నుండి 177 మంది బాలురు 179 బాలికలు మొత్తం 342 హాజరు కాగా వీరిలో బాలురు 176, బాలికలు 178 మొత్తం 340 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 99.44% బాలికల ఉత్తీర్ణత శాతం 99.44% మొత్తము ఉత్తీర్ణత శాతం 99.42% గా నమోదు అయినట్లు ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుండి అత్యధికంగా 571 మార్కులతో జడ్పిహెచ్ఎస్ బాలురు హుజురాబాద్ పాఠశాలకు చెందిన కళ్లెపు అభినవశ్రీ ప్రథమ స్థానం పొందగా జెడ్పిహెచ్ఎస్ చెల్పూరుకు చెందిన గాలిబు చరణ్ 561మార్కులతో రెండవ స్థానం సాధించారని వివరించారు. ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రథమ స్థానంలో 587 మార్కులతో టెట్రా హెడ్రన్ మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థిని ఏ సహస్ర,583 మార్కులతో మాంటిసోరి పాఠశాల నుండి జి.రిషివర్ధన్ ద్వితీయ స్థానం పొందినట్లు మండల విద్యాధికారి తెలిపారు. ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులను అభినందిస్తూ మండలంలో మంచి ఫలితాలు రావడంలో కృషి చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను, విద్యార్థినీ, విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలికి సన్మానం

**-సన్మానించిన హుజురాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ ఆర్ సుహాసిని**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 29 :** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం సమావేశం బుధవారం కరీంనగర్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పిసిసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణను స్థానిక మునిసిపల్ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం సుహాసిని మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ విభాగాన్ని బలోపేతం చేస్తామని అన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని తెలిపారు. రాబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లోను అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్న ఆశాభావం సుహాసిని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు సంస్థగతంగా ఎక్కువ అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రధానం

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 29 :** హుజురాబాద్ పట్టణంలోని న్యూ కాకతీయ మోడల్ స్కూల్లో షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని కరాటే మాస్టర్ జలీల్ ఖాన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించారు. వేసవి శిక్షణ తీసుకున్న విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ బెల్ట్ ప్రధానం కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ ఆర్ సుహాసిని హాజరయ్యారు.




ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని, తద్వారా శారీరక మానసిక దృఢత్వం కూడా ఏర్పడుతుందని ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. వేసవి శిక్షణ శిబిరం నిర్వహించిన కరాటే మాస్టర్ జలీల్ ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, సిఐ టి కరుణాకర్, ఎంఈఓ విడపు శ్రీనివాస్, ఉద్యోగ సంఘాన్ని నేత ముజాహిద్ హుస్సేన్, జేఏసీ నేత చందుపట్ల జనార్ధన్, కౌన్సిలర్ వర్ధినేని రవీందర్రావు, కాలిక్ హుస్సేన్, వెంకట్, కొలిపాక సమ్మయ్య, న్యూ కాకతీయ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి రాజకుమార్, గోపాల్, వెంగళరావు, ఉప్పు శ్రీనివాస్, మల్లేష్ గోస్కుల నాగమణి మధు, అంబాల ప్రభు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. బెల్టులు అందుకున్న విద్యార్థులను అందరూ అభినందించారు.

# యాదవ సంఘం మండల అధ్యక్షునిగా మల్లేష్ యాదవ్ నియామకం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 29 :** ఎల్లారెడ్డిపేట మండల యాదవ సంఘం అధ్యక్షునిగా రాగట్లపల్లి గ్రామానికి చెందిన మందాటి మల్లేష్ యాదవ్ ను నియమిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు ఏ టి యాదవ్ నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలంలో యాదవుల సంక్షేమ కోసం కృషి చేయాలని ఆయన మల్లేష్ యాదవ్ కు సూచించారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో యాదవులు ఎదుర్కొంటున్న ఇలాంటి సమస్యలైన తన దృష్టికి తీసుకురావాలని యాదవుల సంక్షేమం కోసం ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి గొర్రెలు మేకల పెంపకానికి అందేలా అదే విధంగా సామూహిక గొర్రెల షెడ్ల నిర్మాణం కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు. ఏటి యాదవ్ వెంట అఖిలభారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒగ్గు బాలరాజు యాదవ్ రాగట్లపల్లి మాజీ ఉపసర్పంచ్‌లు మందాటి సతీష్ యాదవ్, మానుక సురేష్ యాదవ్,ఉప సర్పంచ్ మందాటి రాము యాదవ్, కాంగ్రెస్ నాయకులు మందాటి లక్ష్మణ్ యాదవ్, నెత్తెట్ల సురేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# అమిటీ ఇండియా మినీ బ్రాంచ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**చురకలు విలేఖరి వీణవంక ఏప్రిల్ 29 :** వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామంలో శివశక్తి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఏర్పాటు చేసిన అమిటీ ఇండియా మినీ బ్రాంచ్‌ను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ వెహికల్స్ వాడకంతో పర్యావరణం తగ్గించవచ్చని అన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ వాహనంతో పాటు 350 రకాల ప్రొడక్ట్స్ ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగులు ఆమిటీ ఇండియాలో ఐడి తీసుకొని మంచి ఉపాధి పొందవచ్చని తెలిపారు. సేవలను ప్రజలకు చేరువ చేయడానికి ఈ మినీ బ్రాంచ్ దోహదపడుతుందని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ?మాజీ సర్పంచ్ అడిగొప్పల సత్యనారాయణ, ఫౌండర్ మెంబర్ ఎడ్ల ఉప్పల్ రెడ్డి,ఎండి శ్రీనివాస్ రెడ్డి,నిర్వాహకులు కట్టు కోజుల సంపత్,పోతుల సురేష్,జంపయ్య,పూదల శ్రీనివాస్ ఏలుబాక సదయ్య, అడిగొప్పల సత్యనారాయణ వెంకన్న,సంపత్,పోతుల తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో 100% ఉత్తీర్ణత





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 29 :** 10వతరగతి ఫలితాలలో ZPHS ఎల్లారెడ్డి పేట్‌లో చదివి పరీక్షలు రాసిన 71 మంది విద్యార్థులు అందరూ పాస్ అయి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. 29 మంది అబ్బాయిలు 42 మంది అమ్మాయిలు పరీక్షలు రాయగా 28 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించారు. మిర్యాల్కర్ శ్రీజ 560 మరుపాక రిషిక 560 బుర్ర సంజన 551 మార్కులు సాధించినట్టు ప్రధానోపాధ్యాయులు మనోహరచారి తెలిపారు. వీరిని సర్పంచ్ ఎలాగందుల నర్సిములు ఉపసర్పంచ్ బంధారపు బాల్ రెడ్డి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ గంటె లత ఉపాధ్యాయులు ముత్యాల శ్రీనివాస్ రెడ్డి స్వామి శైలజ శ్రీకాంత్ శంకర్ భీకు నాయక్ అంజన్ రెడ్డి రమేష్ వేణుగోపాల్రావు రాజు శ్రీనివాస్ మధుసూదన్ ఇబ్రహీం శ్రీ శైలవతి శ్రీనివాస్ అభినందించారు. ప్రభుత్వ హై స్కూల్ నారాయణపూర్లో,,,, పదో తరగతి వార్షిక పరీక్షల్లో బాలురు 06, బాలికలు 13, మొత్తం 19, పాస్ పర్సంటేజీ 100%. టాపర్లు ఎస్ స్నేహలత 572 ఎస్ హర్షిని 566 జి ప్రణవి 560. మార్కులు సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ఎంతో గర్వంగా తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ప్రతిభ

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్, ఏప్రిల్ 29 :** కమాన్ పూర్ మండలంలో కమాన్ పూర్, జూలపల్లి, రొంపికుంట గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు కలవు. పదోవ తరగతి పలితాలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఇందులో భాగంగా పదోవ తరగతిలో మండల స్థాయిలో రొంపికుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇటవేన ప్రణయ్ 569 మార్కులు సాదించి ప్రథమ స్థానంలో నిలువగా అదే పాఠశాలకు చెందిన అంకం ఐశ్వర్య 564 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో, కమాన్ పూర్ పాఠశాలకు చెందిన అంజుమ్





సుల్తానాని 561 మార్కులు సాధించి తృతియ స్థానంలో నిలిచారు. కమాన్పూర్ పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత సాధించగా రొంపికుంట పాఠశాలలో 99 శాతం, జూలపల్లి పాఠశాలలో 99 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలల్లో చాల మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించారు.

**రొంపికుంట పాఠశాలలో..**

రొంపికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 71 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా70 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందు లో ఇటవేన ప్రణయ్ 569 మార్కులు, అంకం ఐశ్వర్య 564 మార్కులు, ఎం. అశ్విత 545 మార్కులు సాధించారు.

**కమాన్ పూర్ పాఠశాలలో..**

కమాన్ పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతిలో 59 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో అంజూమ్ సుల్తానా 561 మార్కులు, అక్షయ 553 మార్కులు, సాహితి 548 మార్కులు సాధించారు.

**జూలపల్లి పాఠశాలలో..**

జూలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థులు పదోవ తరగతి పరీక్షలు రాయగా 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కుమ్మం రిషిత 551 మార్కులు, బొజ్జ మణి చరణ్ 538 మార్కులు, వైద్య శ్రీహిత 528 మార్కులు సాధించారు.

# పదవ తరగతి ఫలితాల్లో వాసవి విద్యార్థుల ప్రభంజనం

**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఏప్రిల్, 29 :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాసవి పాఠశాల పదవ తరగతి ఫలితాల్లో 2025- 26 విద్యా సంవత్సరానికి గాను ఉత్తమ ప్రతిభను సాధించారు. మొత్తం 31 1మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 271 మంది విద్యార్థులకు 550 కి పైగా మార్కులు సాధించడం విశేషం. 587 మార్కులు ఇద్దరు,580 కి పైగా 15 మంది విద్యార్థులు, 570కి పైగా 43 మంది విద్యార్థులు, 560 కి పైగా 82




మంది విద్యార్థులు, 550 కి పైగా1 28 విద్యార్థులు విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ ఫలితాలలో వాసవి పాఠశాల 100% ఉత్తీర్ణత సాధించి మరోసారి తన ప్రతిభను నిరూపించుకుంది. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేస్తూ విద్యార్థులకు శాలువాతో సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కరస్పాండెంట్ పోతా రెడ్డి, సెక్రటరీ జగదీశ్వర్ రెడ్డి,ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ శెట్టి, రాజకుమార్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టెన్త్ ఫలితాలలో జిల్లాకు 11వ స్థానం

**-100% ఉత్తీర్ణత సాధించిన బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు**

**చురకలు ప్రతినిధి,జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 29 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షల ను మార్చి 14 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 20పరీక్ష కేంద్రాల లో 122 పాఠశాలల నుండి 3544 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 3483 మంది ఉత్తీర్ణత సాధించగా 98.36% శాతం ఉత్తీర్ణతతోరాష్ట్రస్థాయి లో జయశంకర్ భూపాలపల్లికి 11 ర్యాంకు లభించింది.

**గత ఏడాది కన్నా పెరిగిన ఉత్తీర్ణత శాతం...**

జిల్లాలో గత ఏడాది పదవ తరగతి పరీక్షలలో 93.5%ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 22వ స్థానంలో నిలిచింది. జిల్లాలో కాటారం రేగొండ మండల లోని విద్యార్థులు 100% ఉత్తీర్ణతను సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో బీసీ వెల్ఫేర్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి యం. రాజేందర్ మాట్లాడుతూ పఠనంలో మనసును పెట్టడం కష్టపడి చదవడం మరియు లక్ష్యాల పట్ల పట్టుదలతో ఉండడం విద్యార్థులకు అత్యంత ముఖ్యమైనవని పరీక్షల ముందు వారికి తెలియజేస్తూ ప్రతి విద్యార్థికి చదువు - విజయం సాధించు అని ప్రేరణను అందించి వారిద్వారా మంచి ఫలితాల ను రాబట్టగలిగామని ఈ సందర్భంగా విద్యార్థులను,ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి సామల రమేష్ మాట్లాడుతూ తల్లి దండ్రులు తమ పిల్లలకు ఎన్నో ఆశలతో బంగారు భవిష్యత్ అందించాలని ఆశిస్తారు వారి కలలు నిజం కావాలంటే వాటికోసం కష్టపడాల్సిందే అని ప్రతి విద్యార్థికి తెలియజేస్తూ పదవ తరగతి పరీక్షల కొరకు ప్రత్యేక తరగతులు విషయ నిపుణులచే నిర్వహిస్తూ , ప్రతి పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా అర్థమయ్యే రీతిలో తిరిగి బోధించే విధంగా, ప్రధానోపాధ్యాయులు అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపే విధంగా, మరియు మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులు విజయం సాధించేందుకు అందరూ కృషి చేశారని అన్నారు.

# జ్ఞాపకార్థం సైకిల్ బహుకరణ



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఏప్రిల్ 29 :** తమ దివంగత కుమారుని జయంతిని పురస్కరించుకుని ఓ విద్యార్థి నికి సైకిల్ బహూకరించి దాతృత్వాన్ని చాటుకున్నారు గోదావరిఖనికి చెందిన సిరిపురం శ్రీనివాస్-మమత దంపతులు. సుమారు సంవత్సరం క్రితం అకాలమరణం చెందిన తమ కుమారుడు వంశీ స్మారకార్థంగా బుధ వారం ఆయన జయంతిని పురస్కరించు కుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలకుర్తి మండలం బసంత్ నగర్ గుట్ట క్వార్టర్స్ కాలనీకి చెందిన ఐఎంఎస్ పదవ తరగతి విద్యార్థిని అదితికి సైకిల్‌తో పాటు స్కూల్ బ్యాగ్‌ను అందజేశారు శ్రీనివాస్-మమత దంపతులు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పుట్టెడు దుఃఖంలోనూ కుమారుని స్మారకార్థం సమాజంలో అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా ఇతరుల కళ్లల్లో ఆనందాన్ని చూడాలనే సంకల్పం తో సాయానికి ముందుకు వస్తున్న సిరిపురం శ్రీనివాస్-మమత దంపతులు అభినందనీయులని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను స్ఫూర్తి గా తీసుకుని జయంతులు, పుట్టిన రోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి సందర్భాలలో దాతలు ముందుకు వచ్చి సమాజంలో అవసరమైన వారికి తమ వంతు సాయం అందించాలని వారు పిలుపునిచ్చారు. కాగా తమ అవసరాన్ని గుర్తించి, అడగకుండానే సైకిల్, బ్యాగ్ బహూకరించిన సిరిపురం దంపతులకు, అదితి, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో వంశీ సోదరుడు సూర్య, ప్రముఖ కళాకారులు మేజిక్ రాజా,చంద్రపాల్, బోడకుంట వెంకటరాజం,అట్ల జగ్గయ్య, అదితి తల్లిదండ్రులు సంతోష్ కుమార్-అనిత కుమారి, కాలనీవాసులు పిట్ట శంకర్-వాణి, కుమార్-పద్మ, సంజన, జ్యోతిర్మయి, జీ.విశ్వనాథ్, జీ.కుమార్, సునీల్ శర్మ, హరీందర్ యాదవ్, మేనేజర్ యాదవ్, కవిత, మొగిలి పద్మ, శ్రీలత, మోనిక తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో మాంటిస్సోరి విజయభేరి



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 29 :** ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించడంతోపాటు అత్యధిక మార్కులు సాధించినట్లు మాంటిస్సోరి ప్రిన్సిపాల్ గీతాషాజు తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ..జి రిషి వర్ధన్ 600మార్కులకు 583 సాధించి మొదటి స్థానంలో నిలిచారని,ఎం నిహాల్ 581, జి.అభినవ్ 581,మహమ్మదీ బేగం 577, ఎం.ప్రణతి 573,కే.సాన్విత్ 571 లతోపాటు 30 మంది విద్యార్థులు 550 కి పైగా మార్కులు సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఆమె అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో, అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

## యూనివర్సల్ స్కూల్ 10లో ప్రభంజనం




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఏప్రిల్ 29 :** పెద్దపల్లి జిల్లా,పాలకుర్తి మండలం, ఘనశ్యాందాస్ నగర్ గ్రామపంచాయితీ పరిధిలోని ప్రముఖ పాఠశాల అయిన యూనివర్సల్ నీట్,ఐఐటీ పౌండేషన్ హ స్కూల్ విద్యార్థులు సాధించిన పదో తరగతి ఫలితాల ప్రభంజనం పి.తేజశ్రీ 589మార్కులు పొంది స్టేట్ 9 వా ర్యాంక్ సాధించినది. 580 పైన 7గురు 550 పైన 38 మంది,500 పైన 87 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఇస్మాయిల్ మరియు ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్ విద్యార్థులను అభినందించారు.

## 10వ తరగతి ఫలితాల్లో కరీంనగర్ బాయ్స్-3 విద్యార్థుల హవా



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 29 :** రాష్ట్ర ప్రభుత్వం 10వ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో మొగ్దుంపూర్‌కు చెందిన మైనారిటీ గురుకులం (బాయ్స్-3), కరీంనగర్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అద్భుత విజయాన్ని సాధించారు. మొత్తం 41 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై, 41 మంది విద్యార్థులూ ఉత్తీర్ణులై 100% ఫలితాన్ని నమోదు చేయడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభ ప్రత్యేకంగా మెరిసింది. బి. శ్రీ చరణ్ (హాల్ టికెట్ నం: 2613104523) -- 564/600 మార్కులు,బి. అభిరామ్ (హాల్ టికెట్ నం: 2613104581) -- 564/600 మార్కులు సాధించి మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా, ఈ విద్యాసంస్థకు చెందిన మొత్తం 17 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం గర్వకారణం. ఇది విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, మరియు పాఠశాల నిర్వహణ యొక్క సమిష్టి ఫలితంగా నిలిచింది. ఈ విజయంపై ప్రిన్సిపాల్ పొరండ్ల చంద్ర మోహన్ ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థుల పట్టుదల, కష్టపడి చదివిన తపనను అభినందించారు. అలాగే ఉపాధ్యాయుల కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో ఇంకా ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ అద్భుత ఫలితంతో కరీంనగర్ బాయ్స్-3 విద్యార్థులు తమ ప్రతిభను మరోసారి చాటుకుని, పాఠశాల ప్రతిష్టను మరింతగా పెంచారు.

# క్వీన్ ఆఫ్ సబ్ స్టాన్స్ పోటీల్లో భారత ఎన్ఆర్ఐ విజయం

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** న్యూఢిల్లీలో జరిగిన మిసెస్ ఇండియా క్వీన్ ఆఫ్ సబ్జెన్స్ 2026 (సీజన్ 15) పోటీలో జుబేలకు చెందిన పల్లవి సోనవానే అఖండ విజయం సాధించారు.ఢిల్లీలోని ఐటీసీ వెల్కమ్ హోటల్లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె సఫైర్ 2026 విభాగంలో సెకండ్ రన్నర్-అప్ టైటిల్ను గెలుచుకున్నారు. బ్యూటీ విత్ ఎ పర్పస్ అనే పేరుతో జరుగుతున్న ఈ పోటీ లో ఈ ఘనత సాధించిన సౌదీ అరేబియాకు చెందిన తొలి ఎన్నారై మహిళ పల్లవి.బ్యూటీ విత్ ఎ పర్పస్ మేధస్సు,నాయకత్వ నైపుణ్యాలు మరియు సామాజిక నిబద్ధత ఆధారంగా నిర్వహించిన అంతర్జాతీయ పోటీలో



భారతదేశం మరియు విదేశాల నుండి వచ్చిన వందలాది మంది పోటీదారుల ను ఓడించి ఈ విజయాన్ని సాధించారు .గత 23 సంవత్సరాలుగా సౌదీ అరేబియాలో నివసిస్తున్న పల్లవి, తన్నీ పెట్రోకెమికల్స్ ఇంజనీర్ గా పనిచేస్తున్న తన భర్త మరియు ఇద్దరు పిల్లలతో కలిసి జుబేల్లో నివసిస్తున్నారు.పల్లవి సోనవన్ ఈమె కేంబ్రిడ్జ్ బోర్డ్ స్కూల్లో శాశ్వత నివాసి, ఉపాధ్యాయురాలి గా, వ్యాపారవేత్తగా,నర్తకిగా - పేరుగాంచిన ఆమె,సోషల్ మీడియా వేదికలపై కూడా ప్రముఖంగా కనిపిస్తారు.సౌదీ అరేబియా మహిళలకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసినప్పుడు, డ్రైవింగ్ లైసెన్స్ పొందిన మొదటి ప్రవాసి ఈమె.ఆమె ప్రముఖ మహిళల్లో ఒకరు.ఆమె సౌదీ అరె బియాలో జరిగిన తొలి మహిళల క్రికెట్ టోర్నమెంట్లో కూడా పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో న్యాయనిర్ణేతగా, వ్యాఖ్యాతగా రాణించే పల్లవి, జూబ్లీ వింటర్ కార్నివాల్ వంటి కార్యక్రమాల ద్వారా భారతీయ గృహిణులకు సాధికారత కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నారు.ఆమె భారతదేశంలోని హోటల్ వ్యాపారంలో కూడా చురుకుగా ఉన్నారు. ఇండియన్ ఓవర్సీస్ ఫోరమ్ ఆమె ఒక కార్యకర్త కూడా. అనాథాశ్రమాలు, వృద్ధుల సంక్షేమానికి తన సమయాన్ని వెచ్చించే పల్లవి విజయం మరింత మంది మహిళలకు స్ఫూర్తినిస్తుందని ఇండియన్ ఓవర్సీస్ ఫోరమ్ అధ్యక్షుడు అనిల్ అన్నారు. సాటా, టాసా కోర్ టీమ్ సభ్యులు మల్లేశన్, శ్రీనివాస్ మచ్చ, తేజ, స్వామి అభినందనలు తెలిపారు.

# అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

**-కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు : జువ్వాడి కృష్ణారావు**

**చురకలు ప్రతినిధి కోరుట్ల ఏప్రిల్ 29 :**

తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి



కృష్ణారావు అన్నారు బుధవారం కోరుట్ల నియోజకవర్గంలో ఆయన సుడిగాలి పర్యటన చేపట్టారు ఈ సందర్భంగా మోహన్‌రావుపేట రేగుంట మల్లాపూర్ పాత దామరాజుపల్లి రాఘవపేట బండలింగాపూర్ గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు అదేవిధంగా మల్లాపూర్ మండలం హుస్సేన్‌నగర్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు అంజిరెడ్డి నాయకులు రాజు పుష్పలత నరసయ్య జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎల్లాల జలపతి రెడ్డి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు ఇతరంగా మండల గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచులు వార్డు సభ్యులు ఎంపీటీసీలు మాజీ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు

# కన్నతల్లిదండ్రులను వేధిస్తున్న కొడుకు, కోడలు

**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** జగిత్యాల పట్టణం వాణీ నగర్‌కు చెందిన బట్టు శంకర్ (78) అనసూయ(74)అనే వృద్ధతల్లి దండ్రుల ను అనారోగ్యంతో భాద పడుతున్న ప్పటికి,పోషించని కనికరం లేని కొడుకు హరీష్,కోడలు జయలు ఇంట్లోంచి వెళ్లి పోవాలని తీవ్ర వేధింపు లకు గురి చేస్తున్నారని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో ఆర్డీవో మధు సూదన్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదుకు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం జిల్లా సీనియర్ సిటిజెన్స్ కా ర్యాలయంలో వృద్ధ తల్లి బట్టు అనసూయ విలేకరులకు తన గోడు వినిపిస్తు రోధించారు.తాము కష్టార్జితం గా సంపాదించుకున్న ఆస్తులను అనుభవిస్తున్న కొడుకు హరీష్,కోడలు జయలు అస్తమా, షుగర్ రోగాలతో భాదపడుతున్న తండ్రి శంకర్ ను,తల్లి నైన మమ్మల్ని వైద్య ఖర్చులు పెట్టక, ఇల్లును అమ్ముకుంటానని మమ్మల్ని వెళ్లి పోవాలని తీవ్ర వేధింపుల, హింసలకు గురించేస్తున్న కొడుకు,కోడలుపై చర్యలు తీసుకోవాలని,మా ఇంటిని, ముంబయి లో మేము కట్టు కున్న ఇల్లు ను మా పేరిట మార్పించాలని, వేధింపులకు గురి చేస్తున్న కొడుకు, కోడలును ఇంట్లోంచి వెళ్లగొట్టి మా స్వాధీనం



చేయించాలని కొడుకు, కోడలు పై ఆర్డీవో కు ఫిర్యాదు చేశామని, సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరిఅశోక్ కుమార్ సాయంతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని ఆవేదన వ్యక్తం చేసింది. వృద్ధతల్లి అనసూయ వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్, వృద్ధుల చట్టం కాన్సిలియేషన్ అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జనసమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 29 :** తెలంగాణ జన సమితి పార్టీ 8వ ఆవిర్భావ దినోత్సవ సందర్భం గా ఇబ్రహీంపట్నం మండలం కేంద్రం లోని కొత్త బస్టాండ్‌లో తెలంగాణ జన సమితి పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి కంతి మోహన్ రెడ్డి,పార్టీ జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్ జెండా



ఆవిష్కరించారు. అనంతరం జనసమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పై పోరాటంలో - తెలంగాణ జన సమితి పార్టీ ముందు ఉంటుం దని, నిరంతరం ప్రజా సమస్యలపై, విద్యార్థి-నిరుద్యోగ సమస్యపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి పార్టీ అని, రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న పార్టీ తెలంగాణ జన సమితి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలం అధ్యక్షులు కంతి రమేష్,మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, రెబ్బటి మల్లయ్య యాదవ్,కనక మహేష్,బద్దీ రాములు,జిల్లా రాజేందర్ ,కంతి సంజీవ్,గుమ్మడి నర్సయ్య,లాడె రాజేందర్,మేడి నాగేష్,కంతి సంజీవ్, కంతి ఆవుల రాంరెడ్డి,కాలాల ప్రవీణ్, కంతి గంగాధర్,కనక కిషోర్,కంతి హరీష్,కనక బాబ్లూ, తిమ్మని ప్రసాద్, పుస్తెమ్ అరుణ్, తెలంగాణ జన సమితి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 29 :** జగిత్యాల పట్టణంలో గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులు 2025 2026 విద్యా సంవత్సరపు 10వ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. ఈ ఫలితాల్లో నిషిత రెడ్డి 582, సాయి శ్రీ 571, మధుప్రియ 563, హస్మిత రెడ్డి 562, సిమ్రా 561, షాగుప్తా 560, హనియా 559, ఆఫ్ఫిన్ 555, సౌద్ 549, నిహారిక 545 అత్యుత్తమ మార్కులు సాధించి అద్భుత విజయాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అరుంధతి మాట్లాడుతూ విద్యార్థుల కఠోర శ్రమ, అంకితభావం, క్రమశిక్షణే ఈ అద్భుత ఫలితాలకు మూలమని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ ఎం. వెంకటనారాయణ, సీఈవో భరత్ ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయుల నిరంతర కృషి, ప్రణాళికాబద్ధమైన బోధనతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారం కూడా ఈ విజయానికి ప్రధాన కారణమని వారు ప్రశంసించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఇలాంటి విజయాలు మరెన్నో సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే



**చురకలు విలేకరి, బీర్పూర్,ఏప్రిల్ 29 :** సారంగాపూర్ మండలం లోని బట్టపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన గుర్రం మధు పావని దంపతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మాణం పూర్తయింది. బుధవారం గృహ ప్రవేశం సందర్భంగా వారి ఆహ్వానం మేరకు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ఇంటిని ప్రారంభించి లబ్దిదారులకు శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వహీద్, ఎంపిడివో సలీం, నాయకులు సత్యనారాయణ ,గుర్రాల రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు నారాయణ రావు, గుర్రం స్వామి, డిల్లీ రామారావు, మల్లేశం, ఉప సర్పంచ్ రాజయ్య, సర్పంచ్ మల్యాల శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి లు సుధాకర్ రావు,సాయిలు,మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు,స్తానిక వార్డు సభ్యులు శోభన్ నాయకులు ప్రేమానందం మండల నాయకులు అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం







**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం ,ఏప్రిల్ 29 :** పదవ తరగతి ఫలితాలు బుధవారం విడుదల కాగా ఇబ్రహీం పట్నం మండలంలోని ప్రభుత్వ పాఠశా లలో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలి తాలు సాధించారని మండల విద్యాధి కారి బండారి మధు తెలిపారు. మండలంలో ఉత్తీర్ణత శాతం 99.33 శాతంగా ఉందని, గోదూరు ఉన్నత పాఠశాలలో చదివిన ప్రణీత 578 మార్కులతో మండలంలో మొదటి స్థానం,హర్షిని 569 మార్కులతో రెండవ స్థానం సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ను ఎంఈవో అభినందించారు.